# ఘనంగా 'ఉత్సద్ భగత్ సింగ్' సినిమా విజయోత్సవాలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో 'ఉత్సద్ భగత్ సింగ్' సినిమా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు, జనసేన పార్టీ నాయకుల సమక్షంలో గురువారం ఈ వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఈర్ల సునీల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడ్‌హాక్ కమిటీ మెంబర్ అల్లూరి సాయికుమార్, ప్రేమ్ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. సినిమా సూపర్ హిట్ సాధించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వినేష్ రెడ్డి, పోతుల ప్రవీణ్, శెట్టి రాజేష్, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ జిల్లా ప్రెసిడెంట్ అజీజ్, సెక్రటరీ ఆర్నకొండ ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది సందర్భంగా పచ్చడి పంపిణీ




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఉగాది పండుగను పురస్కరించుకొని టీఎస్యూటీఎఫ్, ఏఐడీడబ్ల్యూఏ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ, మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పండుగ కొత్త సంవత్సరానికి శ్రీకారం చుడుతూ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, సభ్యులు, స్థానిక ప్రజలు ఉగాది పచ్చడిని పంచుకుని ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి




**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తాండూర్ మండల వ్యవసాయ అధికారి సుష్మా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే చేపడుతున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2026 ఫిబ్రవరి 28 వరకు కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు ఇప్పటివరకు రైతు భరోసా పొందని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తదితర అవసరమైన పత్రాలను జత చేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని ప్రభుత్వ సహాయం పొందాలని కోరారు.

# తిరుమల స్వామి దర్శనం చేసిన చైర్పర్సన్ దంపతులు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఉగాది పండుగ పర్వదినాన ఆదిలాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ దంపతులు తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని గురువారం దర్శించుకున్నారు. ఉదయం 4 గంటల ప్రాంతంలో సుప్రభాత సేవలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం పంచాంగ పఠనం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు అష్టైశ్వర్యాలు, ఆరోగ్యాలు కలగాలని, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు మరింత మెరుగుగా జరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలందరూ సుఖసంతోషాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించాలని కోరారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది సంబురాలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉగాది పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నాయకులు, కార్యకర్తలకు ఉగాది పచ్చడి, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నరేష్ జాదవ్ మాట్లాడుతూ ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితాన్ని ప్రతిబింబిస్తాయని, సుఖదుఃఖాలను సమానంగా స్వీక రించాలని అన్నారు. ఈ నూతన సంవ త్సరంలో రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ ఆయు రారోగ్యాలతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఐక్యత పెంపొందిస్తూ అందరూ కలిసి ఈ పండుగను జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చరణ్ గౌడ్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగిల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ సామ రూపేష్ రెడ్డి, కాంబ్లె మంగేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేముల నాగరాజు, తొడసం దౌలత్, గౌలి సంజయ్, సేవాదళ్ జిల్లా సెక్రటరీ అఫ్సర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క హత్య కేసులో వెంటనే చర్యలు తీసుకోవాలి



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలం కొండపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన గర్భిణి హత్య ఘటనపైఐద్వా మహిళా సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మూడు రోజుల క్రితం ఎనిమిది నెలల గర్భిణి ఆదివాసి మహిళ సమ్మక్క దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఐద్వా నాయకులు గురువారం డీఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. సమ్మక్కను హత్య చేసిన నిందితుడు కేర్కర్ చలపతిని తక్షణమే అరెస్ట్ చేయడంతో పాటు ఈ ఘటనకు సంబంధించి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, జిల్లా ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమ్మక్క కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఐద్వా మహిళా సంఘం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు మాచర్ల వినోద్, దుర్గం అనిత, షాహిన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ముంజం ఆనంద్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో ఉగాది వేడుకలు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పరాభవనామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మేళవింపే మన జీవితమని, ఈ నూతన సంవత్సరంలో రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐక్యతతో ఈ పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, మార్కెట్ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, ఐఎన్టీ యూసీ జిల్లా అధ్యక్షులు మునిగిల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ సామ రూపేష్ రెడ్డి, కౌన్సిలర్లు చరణ్ గౌడ్, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, కాంబ్లె మంగేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ వేముల నాగరాజు, తొడసం దౌలత్ రావు, గౌలి సంజయ్, సేవాదళ్ జిల్లా సెక్రటరీ అప్సర్ ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు పవిత్ర మాసం 'రంజాన్'

**• మంత్రి గడ్డం వివేకానంద**




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ముస్లిం సోదరులకు పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఇఫ్తార్ విందుతో పాటు 'ఈద్ కా తోఫా'అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాబు రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందజేస్తోందని తెలిపారు. జైపూర్ మండలానికి 350 తోఫాలు మంజూరు చేయగా, ఇందారం గ్రామానికి 250 కేటాయించామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, తాగునీరు, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు ఈ కార్యక్రమాల అమలుపై శిక్షణ కూడా అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేసి వృత్తి విద్యలో శిక్షణ అందించి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈద్ కా తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు కానుకలు అందజేసి, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన వాటర్ షెడ్‌ను ప్రారంభించారు. తదనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఎజోన్‌లో గల బిలాల్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కూడా మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# అక్రమ పేలుడు పదార్థాల రవాణా

**• ముగ్గురు అరెస్టు**

**ఉద్యమ కెరటం, జైనూర్:** అక్రమంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ముగ్గురు నిందితులను జైనూర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి భారీ మొత్తంలో పేలుడు పదార్థాలతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కిషన్ లాల్ జాట్, అజయ్ పాల్ జాట్, ఆశిష్ జైస్వాల్ లను అదుపులోకి తీసుకున్నారు. వీరు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ జిల్లా ఇస్లాపూర్ గ్రామానికి చెందినవారని గుర్తించారు. ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా బావుల్లో రాళ్లు పేల్చేందుకు పేలుడు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పేలుడు పదార్థాల అక్రమ వినియోగం, నిల్వ, రవాణా వంటి చర్యలు అత్యంత ప్రమాదకరమైనవి మాత్రమే కాకుండా కఠిన శిక్షలకు గురిచేసే నేరాలని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు కలిగించే ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బావులు తవ్వడం, ఇతర పనుల కోసం పేలుడు పదార్థాలు ఉపయో గించాలంటే సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా పేలుడు పదార్థాలు తీసుకురావడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఈ కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోందని, ఇతరుల ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

